# ఎన్నికలకు మరో ఆయుధంగా సిఏఏ

**2019లో** పార్లమెంటు ఆమోదం పొందిన పౌరసత్వ సవరణ చట్టాన్ని (CAA) ఐదు సంవత్సరాలపాటు దాచిపెట్టి 2024 పార్లమెంటు ఎన్నికలకు కొద్ది రోజుల ముందు (మార్చి 11)న అకస్మాత్తుగా సవరించిన చట్టాన్ని అమలు జరపబోతున్నామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. ఇందులో అనేక అవకతవకలు ఉండటంతో పాటు మత ప్రాతిపదికన పౌరసత్వాన్ని కల్పించడం అనే అప్రజాస్వామిక లక్షణాన్ని భారతీయ జనతా పార్టీ పాలకులు నిస్సిగ్గుగా బయట పెట్టుకున్నారు. ఈ చట్టం ప్రకారం పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్ దేశాల నుండి (మాత్రమే) వేధింపులకు గురైన కారణంగా భారతదేశానికి వలస వచ్చిన హిందువులు, బౌద్ధులు, సిక్కులు, జైనులు, పార్శీలు, క్రిష్టియన్లు (మాత్రమే) కొన్ని షరతులతో భారత పౌరసత్వాన్ని పొందవచ్చు. కానీ ఆ మూడు దేశాల నుండి భారతదేశానికి వచ్చిన, లేక తిరిగి వచ్చిన ముస్లింలకు అలాంటి అవకాశాలు లేకుండటమే ఈ సవరణ చట్టం యొక్క విశేషం.

రాజ్యాంగంలోని షెడ్యూల్ VIలో ఉన్న ఈశాన్య రాష్ట్రాలకు ఇది యధాతథంగా వర్తించదు.

బ్రిటీష్ వలస పాలనలో ఉండిన విశాల భారతదేశంలో 1935 వరకు భాగంగా ఉండి, నేడు సరిహద్దు దేశాలుగా ఉంటున్న శ్రీలంక, బర్మా (మయన్మార్)ల నుండి వలస రూపంలో గాని, కాందిశీకులుగా గాని భారతదేశం వచ్చి నివసించే వారికి ఈ పౌరసత్వ సవరణ చట్టం వర్తించదు. పార్సి మతస్తులు ప్రధానంగా ఇరాన్ దేశ మూలవాసులై ఉంటారు. ఆ దేశం నుండి వలస వచ్చిన పార్శీలకు ఈ చట్టం వర్తించదు. కానీ, ఆఫ్ఘనిస్తాన్‌లో వేధింపులకు గురైన భారతదేశం వచ్చేసిన పార్శీలకు ఈ సవరణ చట్టం వర్తిస్తుంది. శ్రీలంకలో సంభవించిన రాజకీయ కల్లోలాల నుండి తప్పించుకోవడానికి భారతదేశం పారిపోయి వచ్చిన హిందువులైనా, బౌద్ధులైనా వారికి భారతీయ పౌరసత్వం ఈ చట్టం ద్వారా లభించదు. ఇక వారిలో ముస్లింలు కూడా ఉంటే చెప్పే పనేముంది!

పాకిస్తాన్, బంగ్లాదేశాలతో తరతరాలుగా ఉంటున్న ఉమ్మడి సాంస్కృతిక సంబంధాల రీత్యా, అలాగే బ్రిటీష్ పాలకుల దుష్ట పథకంలో భాగంగా మత ప్రాతిపదికన జరిగిన దేశ విభజన తాలూకు భావోద్వేగాల కారణంగా, మతం పేరిట లభించే పౌరసత్వ సమస్యకు చాలా సున్నితమైన కోణాలు, అంశాలు అదనంగా ఉంటాయి. సున్నితమైన మత సమస్యను అతి సున్నితంగా పరిష్కరించవలసినది పోయి, మతోన్మాదపూరిత విద్వేషాలను పెంచే విభజన రాజకీయాల ద్వారా రాజకీయ ప్రయోజనాలను భాజపా పాలకులు పొందదల్చుకున్నారు. అసంబద్ధమూ, అప్రజాస్వామికమూ అయిన పౌరసత్వ సవరణ చట్టాన్ని ఐదేళ్ల తర్వాత ఎన్నికల సమయానికి ప్రవేశపెట్టి, కార్పొరేట్ శక్తుల ఆర్థిక ప్రయోజనాలకూ, తమ మతతత్వ రాజకీయాలకూ వినియోగ పెట్టదలుచుకున్నారు.

**దేశాన్ని కుదిపివేసిన పౌరసత్వ చట్టాల వ్యతిరేక ఉద్యమం!**

1955లో ఒక పౌరసత్వ చట్టం ఉండేది. ఇతర దేశాలలో పుట్టి 11 సంవత్సరాల పాటు భారతదేశంలో జీవించిన వారికి కొన్ని మినహాయింపులతో పౌరసత్వం పొందే అర్హత ఒకప్పుడు లభించేది. దానికి 2016లో కొన్ని సవరణలు చేశారు. 2019 డిసెంబర్‌లో మరొక కొత్త సవరణ చట్టాన్ని ప్రవేశపెట్టారు. ఈ చట్టాన్ని పైన పేర్కొన్న కొన్ని ఇస్లామిక్ దేశాల నుండి వచ్చేసిన వారికే పరిమితం చేసి, పౌరసత్వపు అర్హతకు మతాల ప్రాతిపదికను (ప్రత్యేకంగా ముస్లింలను మినహాయించి) నిర్ణయించారు. ఇటీవల కాలంలో ఒక సంవత్సరం పాటుగా నివసిస్తూ, గతంలో ఐదు సంవత్సరాలు భారతదేశంలో ఉంటే చాలుననే నిబంధన ఒకటి మార్చారు.

దానిపై ఆనాడు తీవ్రమైన నిరసన వచ్చింది. ఆరంభంలో అది విద్యార్థుల ఉద్యమంగా ఉండినా చాలా వేగంగా అది ఒక ప్రజా ఉద్యమ స్వభావాన్ని సంతరించుకుంది. అది షహీన్ బాగ్ ఉద్యమంగా పేరుపొందింది. సాధారణంగా బహిరంగ ప్రదేశాలలో సంచరించడానికి సంకోచించే ముస్లిం మహిళలు, బాలికల నుండి వృద్ధుల దాకా చాలా ఉధృతంగా ఐదేళ్ల నాడు దేశవ్యాపిత ఉద్యమాన్ని నడిపారు. దానికి ముస్లిమేతర సమాజం నుండి మత సామరస్యాన్ని కోరుకునేవారు, భారత రాజ్యాంగంలోని కుల మతాలకు అతీతంగా ప్రజలందరి సౌభ్రాతృత్వాన్ని కోరుకున్నవారు, ఇంకా ఇతర ప్రజాతంత్రవాదులు పై ఉద్యమానికి మద్దతుగా నిలిచారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రారంభమైన షహీన్ బాగ్ ఉద్యమం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు విస్తరించి, 1905లో బెంగాల్ రాష్ట్రాన్ని మతం ప్రాతిపదికన విడగొట్టిన బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా నడిచిన వందేమాతరం ఉద్యమాన్ని తలపించే విధంగా సాగింది.

తెలుగు రాష్ట్రాలలో కూడా దాదాపు ప్రతి పట్టణంలో ఉద్యమ శిబిరాలు వెలిసి, అపూర్వమైన సంఘీభావాన్ని పొందగలిగింది. ఆ సందర్భంగా భాజపా పాలకుల క్రూర నిర్బంధం కూడా బ్రిటిష్ పాలకులను మించి పోయింది. ముఖ్యంగా ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయంపై, ఆలీగర్ ముస్లిం యూనివర్సిటీ విద్యార్థులపై, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో ఉద్యమకారులపై తీవ్ర నిర్బంధం అమలు

జరిగింది. అనేకమంది కాల్పులలో మరణించారు. వేలాదిమంది జైళ్ళ పాలయ్యారు.

ఉద్యమకారులపై ఊపా లాంటి క్రూర నిర్బంధ చట్టాలను ప్రయోగించారు. అయినప్పటికీ ఉద్యమాన్ని అణచలేకపోయారు. ఈ సందర్భంగా భాజపా అనుచర బృందాలు ముస్లిం వ్యతిరేక మతోన్మాదతత్వాన్ని విపరీతంగా పెంచడానికి ప్రయత్నం చేశాయి. సుమారు 100 రోజులపాటు ఉధృతంగా సాగిన షహీన్ బాగ్ ఉద్యమం కోవిడ్ మహమ్మారి వ్యాపించిన ఫలితంగా నిలిచి పోయింది. ఈ పరిస్థితులలో ఆనాటి పౌరసత్వ సవరణ చట్టాన్ని మోడీ ప్రభుత్వం అమలులోకి తేలేకపోయింది. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ఈ చట్టంపై వచ్చే నిరసనను ముస్లిం ద్వేష మతోన్మాదం పెంచే విధంగా రెచ్చగొట్టి, తద్వారా ఎన్నికలలో ప్రజల ఎజెండాను తప్పించి, మత ఉద్వేగాల చుట్టూ ప్రచారాన్ని నిర్వహించి, ఓట్లు సీట్లు గడించడానికి వేసిన పచ్చి అభివృద్ధి నిరోధక దుష్ట పథకమిది. తిరిగి దానిని 2024 మార్చ్ నెలలో అకస్మాత్తుగా ప్రవేశపెట్టారు. ఈ పౌరసత్వ సవరణ చట్టం చెల్లదని ప్రకటించవలసిందిగా సుప్రీంకోర్టుకు వెళ్లిన అనేక అభ్యర్థనల ప్రకారం కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు తాఖీదు ఇచ్చి ఏప్రిల్ 9వ తేదీ నాటికి కేసును వాయిదా వేసింది.

**సిఏఏను విమర్శిస్తూ...**

మతం ప్రాతిపదికన పౌరసత్వాన్ని ఇవ్వటం భారత రాజ్యాంగ చట్టాన్ని ఉల్లంఘించటమేనని దేశంలోని అనేకమంది మేధావులు తీవ్రంగా విమర్శించారు. ప్రపంచ మానవ హక్కుల సంస్థలు, ఐక్యరాజ్య సమితి కూడా దీన్ని ఆమోదించ లేకపోతుందని ఇంటర్నేషనల్ ఆమ్నెస్టీ ప్రతినిధి ఆకార్ పటేల్ వ్యాఖ్యానించారు.

ముంబై హైకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న, సుప్రీంకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైవి చంద్రచూడ్ కుమారుడైన అభినవ్ చంద్రచూడ్, ఈ సవరణ చట్టాన్ని రాజ్యాంగ విరుద్ధ మైనదిగా, వైరుధ్యాల మయంగా, అహేతుకంగా ఉందని బహిరంగంగా విమర్శించారు. ఇతర దేశాలలో వేధింపులకు గురవటమే ప్రాతిపదిక అయినట్లయితే, పాకిస్తాన్లో అహమ్మదీయాలు, ఆఫ్ఘనిస్తాన్‌లోని హజారా షియాలు, బర్మా దేశంలోని రోహింగ్యాలు (వీరంతా ముస్లిము తెగలకు చెందినవారు) కూడా భారతదేశంలో పౌరసత్వం పొందడానికి అర్హత కలవారై ఉండేవారు. కానీ భాజపా పాలకుల దురుద్దేశాలు వేరు కదా!

2002లో గుజరాత్ ఘోర దురంతాల తర్వాత, నాటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోడీకి అమెరికా వీసాను నిరాకరించిన అమెరికా దేశపు ప్రపంచవ్యాపిత మత స్వేచ్ఛల కమిషన్ (USCIRF) దాదాపు స్వయం నిర్ణయాధికారం (Atonomous) గలది. మత స్వేచ్ఛలకు సంబంధించి అమెరికా ప్రభుత్వ విధానాలను కూడా విమర్శించగల అధికారాలు దానికి ఉన్నాయి. అలాంటి యు.ఎస్.సి.ఐ.ఆర్.ఎఫ్. భారత ప్రభుత్వపు పౌరసత్వ సవరణ చట్టాన్ని తీవ్రంగా విమర్శించింది. మత వివక్షతతో ప్రత్యేకంగా ముస్లింలకు భారత ప్రభుత్వం పౌరసత్వాన్ని నిరాకరించటాన్ని తీవ్రంగా విమర్శిస్తూ 25 మార్చి నాడు ఒక ప్రకటన విడుదల చేసింది. ఎలాంటి సందర్భంలోనైనా భారత పాలకులతో చర్చించే సమయంలో ముస్లింలపట్ల వివక్షను ప్రదర్శిస్తున్న అంశాన్ని తప్పనిసరిగా ప్రస్తావించవలసిందిగా అమెరికా ప్రభుత్వానికి అది సలహా కూడా ఇచ్చింది.

**హిందువుల పౌరసత్వం పట్ల కూడా తగిన శ్రద్ధ లేని భాజపా పాలకులు!**

బంగ్లాదేశ్ నుంచి దశాబ్దాల క్రితం పశ్చిమ బెంగాల్లోకి వచ్చి నివసిస్తున్న 'మతువ' అనే హిందూ తెగల వారు పౌరసత్వాన్ని పొందడానికి కఠిన నిబంధనలు ఎలా అడ్డు వస్తున్నాయో 31 మార్చ్ ఆదివారం నాటి 'ది హిందూ' దిన పత్రిక ప్రధాన శీర్షిక వార్తను ఇచ్చింది. బంగ్లాదేశీ హిందూ ప్రవాసితురాలు, ప్రస్తుత భారత పార్లమెంటు రాజ్యసభ సభ్యురాలు అయిన మమతా బాల ఠాకూర్, నేటి పౌరసత్వ సవరణ చట్టంలోని కఠిన నిబంధనల గురించి తీవ్రంగా విమర్శించారు.

1971 నాటి కల్లోల కాలంలో షెడ్యూల్డ్ కులాలకు చెందిన లక్షలాది మంది హిందూ తెగల వారు భారతదేశంలోకి కట్టుబట్టలతో వలస వచ్చి, ఇక్కడ నివాసయోగ్యమైన పత్రాలు అనేకం పొందినప్పటికీ, బంగ్లాదేశ్ పాకిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ ప్రభుత్వాలు ఇచ్చిన తొమ్మిది రకాల గుర్తింపు పత్రాలలో ఏదో ఒకటి జోడించమని అడుగుతున్నారు.

"ఒకసారి పరిశీలన కమిటీ ప్రవాసితుల దరఖాస్తును తిరస్కరిస్తే ఇక నిర్బంధ కేంద్రాలే గతి" అని మమతా బాల ఠాకూర్ సిఏఏ నిబంధనల పట్ల ఆందోళన వెలిబుచ్చారు. ఇవి ప్రవాసితులను బానిసలుగా మారుస్తాయని, అందుకే భాజపాకు చెందిన కేంద్ర మంత్రి సంతాను ఠాకూర్‌తో సహా ఎవరము దరఖాస్తులే చేయలేదని చెప్పారు. పాకిస్తాన్ నుండి భారతదేశానికి వలస వచ్చిన హిందువుల పౌరసత్వ సమస్యలపై పనిచేసే విక్రమ సింగు రాజ పురోహిత్ అనే రాజస్థాన్‌కు చెందిన న్యాయవాది కూడా ఈ అంశంలో అనేక చిక్కులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు.

**ముగింపు:**

వలస కాలము కంటే దేశ సంపదలను తీవ్రంగా కొల్లగొట్టే నేటి కాలపు సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు సంఘటిత ప్రజా నిరసన పెల్లుబకకుండా వేసిన రాజకీయ పథకంలో భాగంగా మతోన్మాద ఎత్తుగడలు అమలు జరుగుతున్నాయి.

ఈ కర్తవ్యాన్ని నెరవేర్చటంలో, దళారీ శక్తులకు ఊతం అందించడంలో భాజపాది దేశభక్తి ముసుగులో కొనసాగుతున్న విద్రోహ పాత్ర. దుష్ట పథకాలను ప్రజలు అర్థం చేసుకున్నకొద్దీ రోజుకొక విధమైన సరికొత్త జిత్తులకు పాల్పడుతున్నారు. అందులో భాగంగా మతం ప్రాతిపదికన పౌరసత్వాన్ని అందించే విధానానికి తెరలేపిన భాజపా పాలకులకు అనేక కారణాల

వల్ల వలస వచ్చిన సాధారణ ప్రజల నిత్య జీవన ఈతి బాధల పట్ల ఇసుమంత సానుభూతి కూడా లేదు. సామాజిక కల్లోలాలు సృష్టించి, వాటిని మతోన్మాద రాజకీయాలుగా పెంపొందించి, మత విభజన గండిని సాధ్యమైనంత పెద్దది చేసి, ఎన్నికల యుద్ధానికి సామాన్యులను బలి పశువులుగా మార్చడం వారి రాజకీయ విధానం.

సాధారణ హిందువులతో సహా దేశ ప్రజలు ఎదుర్కొంటున్న అనేకానేక జీవన సమస్యలకు పరిష్కారం సూచించకుండా, వాటిని పక్కదారి పట్టిస్తూ, ఉన్మాద ప్రచారాలతో ఊదరగొట్టడం వారి పద్ధతి. దోపిడీ వ్యవస్థ సృష్టిస్తున్న సమస్యల వైపుకు ప్రజల ఆలోచనలను మరలనివ్వకుండా చేసి, కళ్ళుగప్పి, ఆత్మవంచనా పూరిత భ్రమలకు గురిచేయడం, తద్వారా ఓట్లను సీట్లను గడించడం వారి రాజకీయ ఎత్తుగడ.

ప్రపంచంలో యుద్ధం అనేది లేకుండా పోయి శాంతి ఏర్పడితే, అమెరికా ఆర్థిక వ్యవస్థ ఎలా కుప్పకూలి పోతుందో, దేశ ప్రజల నడుమ మతసామరస్యం ఏర్పడితే భాజపా ప్రభుత్వం కూడా అలాగే కూలిపోతుంది. గాలి బుడగ లాంటి ఈ పరవంచన రాజకీయాలకు ప్రజలు తప్పక అడ్డుకట్ట వేస్తారు.

★★★★★